# మినీ కథ

# ప్రతీకారం

డిశంబర్-14-1986 రాత్రి తొమ్మిదిగంటలు.

హోటల్ అప్సరాలో మూడవఅంతస్థు లోని రూమ్‌నెంబర్ ట్వంటీటూలో కిటికీ దగ్గర కూర్చొని ఉన్నాడు రవీంద్ర. బాగా త్రాగటంమూలాన అతని కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. కళ్ళు చికిలించి చేతికి ఉన్న ఇంపోర్టెడ్‌వాచీలో టైమ్ చూసుకున్నాడు. ఆ తరువాత నెమ్మదిగా తూలుకుంటూవెళ్ళి టీపాయ్‌మీదున్న బెల్ నొక్కాడు. మరుక్షణం ఎదుట హోటల్‌బాయ్ ప్రత్యక్షమయ్యాడు. "ఎస్సార్ ! ఏంకావాలి ?" అంటూ. "మంచి ఫిగరుందా ?" అడిగాడు రవీంద్ర. "ఫస్ట్ క్లాస్ ఫిగరుందిసార్ ! పంపించమంటారా?"

"పంపించు"

బాయ్ వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ తూలుకుంటూ వెళ్ళి డబుల్‌కాట్ మీద అలసటగా వాలాడు. బరువుగా కళ్ళు మూతలు పడుతున్నాయి. మగతలో ఒకే ఊహ... లహరి ఎదుట నిలబడి ఉంది చేతిలో బాకుతో నన్ను మోసం చేస్తావురా ? అంటూ మీదకు వస్తుంది... వస్తుంది... ఆమె చేతిలోని కత్తి రవీంద్ర గుండెల్లోకి కస్సున దూసుకు పోయింది. "అమ్మా !" రవీంద్ర కేక పెట్టి వాస్తవంలోకికొచ్చాడు. అతని షర్టంతా స్వేదంతో నిండిపోయింది. కాలింగ్‌బెల్ మ్రోగింది. రవీంద్ర మంచంమీదనుంచి లేచి తలుపు తీశాడు... మూడుబ్రాందీ బాటిల్స్ త్రాగితే వచ్చినమత్తు, నిషా అంతా వదలిపోయింది రవీంద్రకు ఎదుటి వ్యక్తిని చూడగానే ! చేతికి చిన్న వేనిటీ బ్యాగ్ తగిలించుకొనిచిరునవ్వుతో లహరి... రవీంద్రకు ముఖంలోకూడా స్వేదబిందువులు అలుముకున్నాయి. "లహరీ ! నువ్వా?" అతని మాటలు తడబడుతున్నాయి. "నువ్వు... నువ్విక్కడికెలా వచ్చావ్ ?" కంఠస్వరంలో స్పష్టంగా వణుకుడు కనిపిస్తుంది. లహరి ముఖంలో కొద్ది అసహనం, చిరాకు మేళవించిన నవ్వుతో "అబ్బ ! ఏమిటి రవీంద్రా ! వచ్చిన అతిధిని తలుపు దగ్గర నిలబెట్టి మాట్లాడేస్తున్నావ్ ! బొత్తిగా మర్యాదకూడా తెలియని మనిషివి బాబూ !" అంటూ చనువుగా రవీంద్రను తోసుకొని లోపలికొచ్చింది. లహరి రూమంతటినీ పరికించిచూసి "మకాంకూడా ఈ హోటల్లోనే నన్నమాట ! పెళ్ళి చేసుకోలేదా ? అవునులే ! నీ దృష్టిలో ఆడదంటే సంసారసుఖానికి పనికొచ్చే వస్తువు. ఆ సుఖంకోసం పెళ్ళి చేసుకునే ఖర్మ నీకేం పట్టింది" కంఠంలో ఎత్తిపొడుపు.

"లహరీ... నువ్వు... నువ్వు పెళ్ళి చేసుకున్నావా ?" మాటలు కూడదీసుకున్నాడు రవీంద్ర. లహరి అతనివైపు విచిత్రంగా చూసింది.



"చేసుకున్నాను.... పెళ్ళి చేసుకోకుండా నిన్నే తలచుకుంటూ కూర్చుంటానను కున్నావా ? ఎంత నువ్వు నన్ను మోసగించినా నువ్వు నా పాత ప్రియుడివి రవీంద్రా! నువ్వారోజుల్లో నాకందించిన సుఖాన్ని నేనే నాటికయినా మరువగలనా ? చెప్పు! అందుకే స్నేహితురాలి పెళ్ళిసాకుతో నీ దగ్గరకు వచ్చాను. నీకు సుఖాన్ని అందించి నేను పొందటానికి" లహరి రవీంద్రవంకమత్తుగా చూసింది. రవీంద్ర ఆనందానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి లహరి మాటలు వినగానే.

"ఓ ! లవ్లీ !" అంటూ లహరిని చుట్టుకు పోయాడు రవీంద్ర.

"అబ్బ ! ఆగు రవీంద్రా ! అంతతొందర

## జూనియర్ మానస

రయితే ఎలా ? బస్సు ప్రయాణం చేశాను కదా ! ఒళ్ళంతా మంటగావుంది. నేనెళ్ళి స్నానంచేసి వస్తాను" అంటూ అతన్నుంచి విడిపడి టవల్ తీసుకొని బాత్రూమ్‌కెళ్ళింది లహరి. రవీంద్ర టేప్‌రికార్డర్ ఆన్‌చేశాడు. చెవులకు విందయిన వెస్ట్రన్‌మ్యూజిక్ వస్తుంటే ఆనందంగా విజిలేయసాగాడు. అంతలో డోర్ తెరుచుకొని బాయ్ వచ్చాడు ఒక సుందరాంగితో, రవీంద్ర షర్ట్ జేబులోంచి పదిరూపాయల నోటుతీసి బాయ్‌కిచ్చి ఇప్పుడు ఫిగర్ అవసరంలేదని చెప్పి పంపించాడు. బాయ్ వెళ్ళిన అయిదునిముషాలకు బాత్రూమ్‌నుండి బయటికొచ్చింది లహరి. తడిచీర ఒంటికి చుట్టుకొని, ఆ పల్చటి తడి తెల్లచీరలోంచి ఆమె ఒంపుసొంపులు



స్రవంతి విసూత్న వారపత్రిక 12-2-1987

# మినీ కథ

స్పష్టంగా కనబడుతున్నాయి. ఉద్రేకం ఆపుకోలేక ఆమెను ఎత్తి మంచంమీద వేశాడు రవీంద్ర. "రవీంద్రా!" మత్తుగా మూల్గింది లహరి.

*  *  *

డిశంబర్-17-1986

మధ్యాహ్నం పదకొండు గంటలు.

రవీంద్రకు మెలుకువ వచ్చేసరికి పద కొండయ్యింది. బద్ధకంగా అవులించి ఒళ్ళు విరుచుకొని కళ్ళు మూసుకునే ప్రక్కలు తడిమాడు రవీంద్ర. ఎప్పటిలా అతనిచేతికి తగిలే లహరి నగ్నశరీరం తగలకపోవ టంతో అతను కళ్ళుతెరిచి బాత్రూమ్‌వైపు చూశాడు. బాత్రూమ్ తలుపుకు బైట బోల్ట్ చేసి ఉండటంతో రవీంద్ర దిగ్గునలేచి గదిని ఒక్క పర్యాయం పరికించి చూశాడు. లహరి వేనిటీబ్యాగ్ లేదు... అంటే లహరి వెళ్ళిందా? తనకు చెప్పి ఎందుకు వెళ్ళలేదు?

అతనికీమధ్య చదివిన ఓ కథ గుర్తుకు వచ్చింది. అది గుర్తుకు రావటం ఆలస్యం దిగ్గున లేచి దడదడలాడే గుండెలతో తన సూట్ కేస్ తెరిచి చూశాడు. అతని డబ్బు భద్రంగానే ఉంది.

మరి లహరి తనకు చెప్పకుండా ఎందుకు వెళ్ళినట్లు?

అతని ఆలోచనలను భంగపరుస్తూ కాలింగ్‌బెల్ మ్రోత. రవీంద్ర వెళ్ళి డోర్ తెరిచాడు. ఎదురుగా హోటల్ బాయ్. "సార్ నిన్నటిదాకా మీతో ఉన్న ఆడమనిషి ప్రొద్దున్న వెళ్ళిపోతూ, మీకిమ్మని ఈ ఉత్త రం ఇచ్చి వెళ్ళిందిసార్!" బాయ్ రవీంద్ర చేతిలో ఒక కవరు పెట్టి వెళ్ళిపోయాడు.

రవీంద్ర ఆత్రంగా లోనికొచ్చి కవరు చించి లోపలున్న కాగితం తీసి కళ్ళను అక్షరాల వెంబడి పరిగెత్తించాడు.

ఒరే రవీంద్రా!

ఆ సంబోధనను చూసి ఓసారి ఉలిక్కి పడి తిరిగి ఆ ఉత్తరం చదవసాగాడు రవీంద్ర.

'ఒరే రవీంద్రా!

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన నాకు నాన్న ఎలాఉంటాడోకూడా తెలియదు. అమ్మ నన్ను కూలీనాలి చేసి చదివించింది. అలాంటి సమయంలోనే నువ్వు నాకు పరి చయమయ్యావు. 'ప్రేమ' అంటూ ప్రేమ పాఠాలు వల్లించి నన్ను లొంగదీసుకున్నావు. నా శరీరంతో అవసరం తీర్చుకున్నావు. నేను గర్భవతినని తెలిసి నానుంచి దూరంగా పారిపోయావు. అప్పుడు ఈ సమాజం నన్నెలా హింసించిందో తెలుసా? పెళ్ళి కాకుండానే తల్లినయి కన్నబిడ్డను చెత్త కుండీకి దత్తత ఇస్తున్నప్పుడు నా మన సెంత క్షోభ చెందిందో నీకు తెలుసా? అనారోగ్యంతో నా తల్లి చనిపోతే ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరిగాను. లాభం లేక పోయింది. చివరకు గత్యంతరంలేక వేశ్యా వృత్తి చేపట్టాను. ఎందరో విటులు దేశ విదేశాల్నుంచి వచ్చినవాళ్ళకి ఈ శరీరాన్ని అర్పించాను. వాళ్ళకి సుఖంతోపాటు సుఖ రోగాలనుకూడా పంచియిచ్చాను. కానీ ఇందరికి శరీరాన్ని అర్పించినందుకు ఫలిత మేమిటో తెలుసా? వారంరోజుల క్రితం తెలిసింది నాకు పరమ భయంకరమైన ఎయిడ్స్‌వ్యాధి వచ్చిందని. గుండెలు పగి లేలా ఏడ్చాను. ఆ స్థితిలో నువ్వు గుర్తుకు వచ్చావు. నన్ను ఇంత హీనస్థితికి దిగ జార్చిన నిన్ను వదలకూడదనుకున్నాను. అందుకే ఎంతో కష్టపడి నీ అడ్రస్ సంపా దించి నీ దగ్గరకువచ్చి నాటకమాడి నాలుగు రోజులు నీతో గడిపి సుఖంతోపాటు నాకున్న ఎయిడ్స్‌వ్యాధినికూడా నీకు పంచి ఇచ్చాను. ఇప్పుడు నాకెంతో ఆనందంగా ఉంది.

— లహరి.

రవీంద్ర చేతిలోంచి ఉత్తరం జారి పోయింది. కాళ్ళక్రింద భూమి కంపిస్తున్న ట్లయ్యింది. మెదడులోని నరాలను ఎవరో మెలిపెడుతున్నట్లు... శరీరంలోని రక్తా న్నంతా ఎవరో తోడేస్తున్నట్లు భావన. శరీ రంలో ఎయిడ్స్‌క్రిములు పాకుతున్నట్లు భయంకరమైన అనుభూతి. భయంతో ఎప్పుడు స్పృహతప్పిందో రవీంద్రకే తెలియదు.

## వడ్డెపల్లి పదాలు

భగీరథ ప్రయత్నాన
దిగివచ్చెను దివిజగంగ!
'రామన్న' ప్రయత్నాన
రాదేమీ తెలుగు గంగ?
ఆకలిచావుల కయితే
అలవాటు పడిపోయాం!
దాహపుచావుల్ని కూడ
దర్శించే వీలుందని,
నీరుగారిపోవు ప్రజకు
నీటికి ఎడతెగని బెంగ!
దినం విడచి దినమైనా
దిగిరానీ 'పంపు' గంగ!

వడ్డెపల్లి కృష్ణ

